కవితా కౌముది

# కోడి కూత లోపే..

సుభాషిణి వడ్డెబోయిన

కళ్ళ లోగిలిన చూపుపడకేసి
కలల ధూపమేసి
తలపు తలుపు తెరచుకున్నా
కాలం కరుగుతున్నా
కానరానన్నుకోని
కాదంటానని కలత పడ్డావేమో!
సెలయేటి నవ్వులతో సంచరించిన ఊసులు
చిలిపి మాటలతో చెప్పుకున్న ముచ్చట్లు
మనం అనే వనంలో పండు వెన్నెలలో
పడి పడి కోసుకున్న పూలనడుగు
నా మనసు సువాసనలు చెబుతాయి!
మన చెలిమి వెలుగు కునుకుతో
చీకటికి కునుకాగి
జాబిలి జంట కోరికతో సిగ్గుపడి
మబ్బు ఒడిలో మునిగింది -
చలికే వణుకు పుట్టి
వేడి కోసం వెతుక్కుంటూ
మదిన మత్తును కోరగా
మన పక్కలో ఒలిగి,
తొంగి చూసే జాము వెక్కిరించేలోపే
గుట్టుగా నా గుండెల్లో దూరిపో
కోడి కూత లోపే నీకు దిష్టి తీస్తాను...
కోరిన తీపి కోరికను
మూట కట్టి నీ ముందు ఉంచుతాను...

★★★

# కలలు కరిగాక

వారణాసి నాగలక్ష్మి

రెప్ప వాలితే చాలు
కుప్పతెప్పలుగా ఒకటే కలలు
కనుల గూడు నుంచీ
రివ్వున ఎగిరే రంగురంగుల పిట్టలు!

మెలకువ తెరిచిన కళ్ళలో
మింటి నీలపు తళతళలు
మూసిన పెదవులపై
ముసిముసి నవ్వులు
ఆదమరచిన వదనంపై
అదేపనిగా దొరలే
దరహాస చంద్రికలు

ఆహా... కౌమారమెంత కమనీయం!

ముళ్ళతీగల పెదవులపై
చిరునవ్వుల పువ్వులిపుడు
పూయడం లేదు!
కారుమబ్బులు కుదురుకున్న
ఆ కళ్ళకి నిదురన్నదే లేదు!

కరిగిపోయే కౌమారం
కలల్ని పట్టుకుపోయాక ...
ప్చ్ ... బ్రతుకెంత దీర్ఘపోరాటం!

★★★

# ఉత్తరం

రవిప్రసాద్ చెలమల్లు

కన్నా...,
మన మధ్య దూరాన్ని
నీకోసం ఉత్తరమై దాటాలని,
నాలుగు ముక్కలు రాయాలని
అక్షరాల్ని జల్లెడ పడుతూ ఉంటే...,

నాకు గడచిన జీవితం
ముక్కలు ముక్కలుగా దొరుకుతుంది
కాలాతీత అనుభవాలు
నీకు ఏ అనుభూతిని పంచుతాయో కానీ,
నాకు మాత్రం, నే నడచిన దారెంట
తగిలిన గాయాల కథలు,
గెలిచిన యుద్ధాల కథలు
నీలో కానీ, నీ చుట్టూరా కానీ
భయం చీకట్లు ముసిరినప్పుడు
దారిచూపే దివ్వెలు అవుతాయని ఆశ

నీ ఒంటరితనాన్ని ఏకాంతంగా మార్చి
నా ఉత్తరంలోని అక్షరాలు
నీలోని విచక్షణను తట్టిలేపి,
మధురోహల ఊయల ఊపాలని,
తూలి పడబోయినప్పుడు
ఆసరాగా నిలిచే గడకొయ్య కావాలని
ఓ చిన్న ప్రయత్నం...

మకరందం తాగి వెళ్ళే తుమ్మెద కాళ్ళకు
విరులు పుప్పొడినద్ది
నలుచెరగులా విస్తరించినంత ఒడుపుగా
నీ పెదవులపై సిరివెన్నలంటి చిరునవ్వులు అద్ది,
బ్రతుకు ప్రతి మలుపులో బాసటగా నిలవాలని
గిజిగాడు గూడు అల్లినంత శ్రద్ధగా
నొప్పించని, తానొవ్వని
నాలుగు అక్షరాలు కలిపి
నీ రేపటి కోసం అల్లుతాను

నా ఉత్తరం అంటే
నీలోను, నీ చుట్టూరా నేను నిండిపోయి,
నేను మాత్రమే దూరంగా ఉండిపోవడం...!

★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

జీవితమ్మెల్ల నీకై త్యజించియుంటి
నీ యమితమోదమే నాకు ధ్యేయమయ్యె
ఎల్ల వేళల నీకై తపించుచుందు
నన్ను గూర్చిన యోచన నాకు లేదు

ఎవ్వరో వచ్చి చెవిని బోధించుచుంద్రు
తన్ను మరచుట యెపుడైన తప్పటంచు
నిన్ను ప్రేమించుటేలను మిన్న గాదు?
స్వార్థమెరుగని ప్రేమయే సార్థకమ్ము

కాలమెల్లను నీకయి గడపుచుంటి
బ్రతుకు గడచునిట్టులె తుది శ్వాస వరకు
త్యాగమెరుగని రాగమ్ము రాగమగునె?
ఆర్థమనురక్తికి పరస్పరార్పణమ్ము

ఏను నీ కొరకన్ని త్యజింతునెట్లొ
ఈవు నా కొరకట్లె త్యజింతువెపుడు
భూమినెల్లరకొక్కటే ప్రేమపథము
ఎలమినెరుగక బ్రతుకుట ఎవరి తరము?

అందరును ప్రేమమూర్తులే యవని యందు
ఎంత గడియించినవారులకిచ్చు కొరకె
స్వార్థచింతన బ్రతుకున స్వల్పమెపుడు
విశ్వమెల్ల పరస్పరప్రేమమయము

COMMENTS